
# 'మిసిమి' చౌదరి గారి నిష్క్రమణ

పురాణం సుబ్రహ్మణ్య శర్మ

ఇన్నయ్యగారు నా గురించి చౌదరి గారికి చెప్పారు. ఒక రోజు వారే స్వయంగా వెతుక్కుంటూ వచ్చి నన్ను సికింద్రాబాద్‌లో కలిశారు 'మిసిమి' గురించి చెబుతూ అది నా తృప్తి కోసం నా కాలక్షేపం కోసం నడుపుతున్న చిన్న సీరియస్ పత్రిక' అని తాము పూర్వం తెనాలిలో 'జ్యోతి' నడుపుతున్న కాలం, అప్పటి సంగతులు కొన్ని ముచ్చటించారు. నేను ఆ జ్యోతిలో కూడా ఏవో చిన్న చిన్న కథలు రాశానని చెప్పాను. నేను గురజాడ మీద ఆంధ్రజ్యోతి దినపత్రికలో పుంఖాను పుంఖంగా వ్యాసాలు రాయటం ప్రస్తావన వచ్చినపుడు 'గురజాడ డైరీ'లలోని ఒక విషయం చెప్పాను.



ఒక ఇటాలియన్ ప్రాస్టిట్యూట్ చేత ఆ కాలంలోని ప్రముఖుల్ని ఇంటర్వ్యూ చేసినట్లు కొన్ని ఊహా జనిత ఇంటర్వ్యూల ప్రస్తావన తెస్తూ గురజాడ, "అలాంటిది రాయాలని నాకూ వుంది" అన్నారు గురజాడ. అందుకని నా మనసులో గురజాడ వారి మధురవాణితో కొన్ని ఊహాజనిత ఇంటర్వ్యూలు రాయాలని వుంది అన్నాను. నిజానికి ఆ భావానికి ఒక షేపు నిర్దుష్టంగా యిచ్చి రాయమని నన్ను ప్రోత్సహించిన వారు 'మిసిమి' రవీంద్రనాథ్ చౌదరిగారు. అప్పారావు గారి కోరికను తీర్చేందుకు ఆ శీర్షికను తీర్చి దిద్దేందుకు చౌదరిగారు ఎంతోసహాయపడ్డారు. రాయ కూడనివి రాయతగినవి వారే నిర్ణయించేవారు. అసలు నేను 'మిసిమి'లో ఒక 'ఇల్లాలి ముచ్చట్లు' వ్యాసాన్ని రాశాను. ఆ శీర్షిక గురించి ప్రస్తావించాను. మొదట శ్రీశ్రీ, తర్వాత విశ్వనాథ, చలం, గురజాడ రాశాక త్రిపురనేని రామస్వామి చౌదరిగారి గురించి వ్రాయమన్నారు. నిజానికి 'మిసిమి' ఆర్థికంగా నష్టం వచ్చే ప్రతిపాదన. చౌదరిగారి కుమారులు తండ్రిగారిపట్ల ప్రేమతో విధేయతతో అది నష్టమైనా కష్టమైనా భరించేవారు భక్తితో. చౌదరిగారు 'మిసిమి' నా గర్ల్‌ఫ్రెండ్ అనేవారు ముసిముసిగా నవ్వుతూ - అది మామూలు పత్రిక కానందున ఆయన ప్రచురించే వాటి కంటే తిరగగొట్టేవే ఎక్కువ. పత్రికకు సంబంధించిన గుమాస్తా చాకిరీ అంతా ఆయనే చూసుకునేవారు. ఆంధ్రపత్రిక శర్మగారు మొదట్నుంచీ ప్రూవులు చూసిపెడుతూ చౌదరి గారికి సలహాలు అవీ యిస్తూ స్నేహ ధర్మంగా సాయం చేసేవారు. చాలామంది వ్యాసాలు పంపేవారు, సాహిత్యం అంతగా ఎంకరేజ్ చేసే వారుకాదు. పద్యాలు గేయాలు ప్రచురించడం యిష్టం లేదు. 'మిసిమి' నిరంతరం చౌదరి గారి ఆధ్వర్యాన స్థాయి పెంచుకుంటూ అభివృద్ధి చెందింది. డ్రైగా వుండే పత్రికకు 'మధురవాణి ఇంటర్వ్యూ'లతో రసస్ఫూర్తిని కలిగించామని నమ్ముతున్నాను. 'నార్లగారితో మధురవాణి' రాసినపుడు ఆంధ్ర జ్యోతి వారితో కొన్ని సమస్యలు వచ్చినా తట్టుకొని కష్టాలలో కన్నీళ్లలో నిలబడ్డాను. నేను విజయవాడలో వున్నపుడు వారు విజయవాడ వచ్చినపుడు కలుసు కునేవారం. పత్రిక నడపడం ఎంత కత్తి మీద సామో శీర్షిక నిర్వహించడం కూడా అంతే విమర్శ కూడా గులాబీ రెమ్మతో కొట్టినట్టుండాలి గాని కత్తితో గంటు పెట్టినట్లు వుండరాదు. పొగడ్తకు తట్టుకొని నిలబడినట్లు తెలుగువారు విమర్శను సహించలేరు.

చౌదరిగారు మా పెద్దబ్బాయి నానిని వాడి చిత్రకళను ప్రోత్సహిస్తూ అభిమానించారు. జాషువాగారి ముఖచిత్రంతో 'మిసిమి' వచ్చింది కూడా. నాని, చౌదరి గారు చిత్రకళ సంబంధ మైన కబుర్లు చెప్పుకునే వారు.

నా అభిరుచులు మిసిమి స్థాయి ఉన్నంతంగా వుండటానికి కారణం ఏమీ లేదు. నేను అసాధారణ ప్రజ్ఞావంతుడనుకాను. నా సామాన్య పరిజ్ఞానానికి నా అభిరుచుల్ని జోడించి 'మిసిమి' కల్పన చేశాను. నేను సామాన్యుడను కావటం వలన మంచి ఎడిటర్‌ని కాగలిగాను. తనకు ఏది కావాలో ఏది అక్కర్లేదో, ఎవరిచేత

ఏది రాయించుకోవాలో తెలిస్తే చాలు అన్నారు చౌదరిగారు. తాను గొప్ప మేధావిని కానని చౌదరిగారు తెగేసి చెప్పారు. అసాధారణ సామాన్యుడు 'మిసిమి' చౌదరిగారు.

ఇంటివద్ద ఏమి తీసుకొనేవారో కాని బయట ఎక్కడా ఏమీ తినేవారేకాదు. టీ కూడా తీసుకోరు. వారితో కొన్ని మొక్కలు తీసుకోడానికి ఒకటి రెండు సార్లు ఏదో ఎగ్జిబిషన్‌కు వెళ్లాను. నార్ల వారి గ్రంథాలయాన్ని ఒక సంస్థ వారికి అప్పగించే సందర్భంలో నేను ప్రసంగించాను. అప్పుడు మా పరిచయం మరికొంత గట్టిపడింది వారి వద్దనుంచి కొన్ని అపూర్వమైన పుస్తకాలను తీసుకొని చదివి యిచ్చేసేవాడిని. "మిసిమి నా కాలక్షేపం కోసం నేను ఏర్పరచుకున్నది; దీనికి పునర్జన్మ లేదు -" అనేవారు.

కొడవటి గంటి కుటుంబరావు గారు, చలం, గోపీచంద్, త్రిపురనేని వారు, జి.వి.కృష్ణారావు, శ్రీశ్రీ, చౌదరిగారు వీరంతా సమకాలీనులు, సన్నిహితులు. చక్రపాణి ధనికొండ హనుమంతరావు వీరంతా ఒక




కోవలోనివారు. నాకు అందరితో మంచి సంబంధాలు వున్నందుకు, ఎడిటర్‌గా చాలా ప్రాచుర్యం, పేరు సంపాదించినందుకు నన్ను అభినందిస్తూ వుండేవారు.

ఆయన ఈనాడు పత్రికను కాస్త అభిమానించేవారు. చాలా పత్రికలను శ్రద్ధతో చదివి అందునుంచి తనకు కావలసినవి ఎంచుకొని చెప్పి తెలుగులో రాయించు కునేవారు. అన్నిటికీ ఎంతో కొంత 'పే' చేసే వారు.

ఇటీవల ఎన్.టి.ఆర్ పోవడంతో చౌదరిగారి మాటల్లో తేడా వచ్చింది. 'అయితే మన టర్న్ కూడా రావాలి త్వరలో' అన్నారు నాతో. అలా అనవద్దు, మీ గైడెన్స్ సలహాలు మాకు కావాలి. అయినా ఆ విషయం మన చేతిలో లేనిది అని నేను ప్రొటెస్టు చేశా. వారు నవ్వేసి మీరు మళ్లీ మధురవాణితో ఇంట ర్వ్యూలు రాయాలి అన్నారు. వాల్మీకి అలాంటి వాళ్లతో రాస్తే ? అన్నారు. అంతపెద్ద వాళ్లు మన స్కోపుకి అందరు సార్ అని వారించాను. ఎన్.టి.ఆర్‌తో రాస్తే అన్నారు. అదంతా చాలా 'టచీ' వుంది గొడవలొస్తాయి అన్నానేగాని రాశాను, వారికి పంపాను. 'జీవి మరణించి ఎటకేగునో తెలియరాదు. విని తపించు వారు వేనవేలు' అని అబ్బూరి రామకృష్ణారావుగారు అన్నట్లు చౌదరిగారు మళ్లీ వస్తానని రాకుండా నిష్క్రమించారు తమ వేషం విప్పేసి.

★ ★ ★

ఆప్కో

కొత్త రుచులు
ఆప్కో చేనేతలు

విశిష్టమైన రూపకల్పనల్లో నాణ్యమైన చేతి అద్దకపు అద్భుతాలు
ఈ తరుణంలో

మీ అభిరుచులకి అనుగుణంగా ఎన్నెన్నో రకాలు
అధునాతనమైన నేతల్లో సాంప్రదాయపు సొంపుల్లో కళ్ళు జిగేలుమనిపిస్తాయి.

అన్ని సందర్భాలలో సరిపోయే సరికొత్త రకాల్లో ఆప్కో చేనేతలు.
అపూర్వ కళా ఖండాలనుబోలు గుంటూరు, గద్వాల, వెంకటగిరి జరీ చీరలు;
సిద్ధిపేట, ఉప్పాడ, కొత్తపల్లి, బుటా చీరెలు, పుట్టపాక, నారాయణపేట,
ధర్మవరం, పోచంపల్లి టై అండ్ డై చీరెలు, దుప్పట్లు, తువ్వాళ్ళు, లుంగీలు,
ధోవతులు మరెన్నో చేనేతలు.
సామాన్య కుటుంబీకులకు పనికివచ్చే జనతా చీరెలు, ధోవతులు
చౌక ధరలలో
కంటికింపైన డిజైన్లలో పాలియెస్టర్ చొక్కాలు.
మీకు దగ్గరలో గల ఆప్కో ఫ్యాబ్రిక్స్
విక్రయశాలను
నేడే దర్శించండి.
"సులభ వాయిదాలపై అరువు సౌకర్యం గలదు"

APSHWCSL
ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్,
హైదరాబాదు - 500 029.